
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

# మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక

ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 234 | ఆదివారం 11 మే 2025 | పేజీలు : 4 | వెల : 3/-




## అధికార లాంఛనాల మధ్య మురళీనాయక్

# అంత్యక్రియలు పూర్తి

## వీరజవాన్ మురళీ నాయక్ అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి లోకేష్



- భౌతికకాయాన్ని సందర్శించి అశ్రు నివాళి
- పార్థీవదేవం వద్ద అంజలి ఘటించి సెల్యూట్ చేసిన మంత్రి లోకేష్
- తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యం చెప్పిన మంత్రి లోకేష్
- పార్థీవదేహాన్ని స్వయంగా మోసిన మంత్రి లోకేష్, దగ్గరుండి ఏర్పాట్లు పరిశీలన



**అంకుశం ప్రతినిధిపుట్టపర్తి: మే 11**

ఆపరేషన్ సిందూర్ లో భాగంగా దేశం కోసం ప్రాణాలర్పించిన శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన వీరజవాన్ మురళీనాయక్ అంత్యక్రియల్లో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. కల్లితండాలోని నివాసం వద్ద మురళీ నాయక్ భౌతికకాయాన్ని సందర్శించి అశ్రు నివాళులు అర్పించారు. మురళీనాయక్ పార్థీవదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి సెల్యూట్ చేశారు. అనంతరం అగ్నివీర్ మురళీనాయక్ తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని వారిని - మిగతా2లో



# తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలు




- ఇంజినీరింగ్ విభాగంలో మొదటి 10 ర్యాంకులూ బాలురకే
- మొదటి మూడు ర్యాంకులూ ఏపీకి చెందిన విద్యార్థులకు

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి హైదరాబాద్**

తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలను సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో మొదటి 10 ర్యాంకులూ బాలురకే వచ్చాయి. మొదటి మూడు ర్యాంకులూ ఏపీకి చెందిన విద్యార్థులకు దక్కాయి. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడకు చెందిన పల్లా భరత్‌చంద్రకు మొదటి ర్యాంకు, నంద్యాల జిల్లా కోనాపురం వాసి ఉడగండ్ల రామ్‌చరణ్‌రెడ్డికి రెండో ర్యాంకు, విజయనగరం జిల్లాకు చెందిన హేమసాయి సూర్యకార్తీక్‌కు మూడో ర్యాంకు వచ్చాయి. హైదరాబాద్‌లోని నాచారానికి చెందిన మెండె లక్ష్మీభార్గవ్‌కు నాలుగో ర్యాంకు లభించింది. మంత్రిరెడ్డి వెంకట గణేశ్ రాయల్ - మిగతా3లో

## అమర వీరుడి కుటుంబానికి ప్రభుత్వం

# రూ. 50 లక్షల ఆర్థిక సహాయం

- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యక్తిగతంగా మరో రూ. 25 లక్షలు
- కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటాం
- వీర జవాను మరళీ నాయక్ అంత్యక్రియల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం



**(అంకుశం, గోరంట్ల, మే 11):**

అమర వీరుడు మురళీ నాయక్ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. దేశ సరిహద్దులో వీర మరణం పొందిన జవాన్ మురళీ నాయక్ భౌతికకయానికి ఆదివారం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు లోకేష్, సత్యప్రసాద్, ఎస్.సవిత, సత్యకుమార్ యాదవ్‌తో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు గోరంట్ల మండలం, కల్లితండాలో నివాళులు అర్పించారు. అనంతరం మురళీ నాయక్ తల్లిదండ్రులు జ్యోతి బాయి, శ్రీ శ్రీరాం నాయక్‌లను ఓదార్చారు. చిన్న వయసులో మురళీ నాయక్ గారు యుద్ధంలో ప్రాణోల్పవడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ గారు మీడియాతో మాట్లాడుతూ "గత నెల 22వ తేదీన పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి లో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడి నేపథ్యంలోనే మన దేశం పాకిస్థాన్ కి అండగా ఉన్న టెర్రరిస్ట్ క్యాంపుల మీద దాడి చేసి ఉగ్ర శిబిరాలు ధ్వంసం చేసింది. అందుకు ప్రతిగా సరిహద్దుల్లో పాకిస్థాన్ కూడా కాల్పులు ప్రారంభించడంతో మన దేశంలోని ఐదు సరిహద్దు - మిగతా2లో

# పాక్‌కు గట్టిగా బదులివ్వాలి



- పీవోకే విషయంలో ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదు:
- పీవోకేను మాకు అప్పగించడం తప్ప పాక్‌కు వేరే మార్గం లేదు

## మతిభ్రమించిన సోము వీర్రాజుని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వద్దకు పంపాలి.

- సిపిఐ జాతీయ నేత నారాయణ పై విమర్శలు చేసే స్థాయి నీకు లేదు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ.

**అంకుశం ప్రతినిధి విజయవాడ మే 11**

సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణపై బిజెపి సీనియర్ నేత, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అర్థరహిత వ్యాఖ్యలు చేయడాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు కె రామకృష్ణ నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. "టెర్రరిజాన్ని అంతం చేసేందుకు అందరూ కలిసి పోరాడాలని, ప్రపంచ దేశాలు ప్రపంచ దేశాలు ఇందులో కీలక పాత్ర పోషించాలని, అనివార్యమైతే యుద్ధం తప్పనిసరి అని" ప్రజాభిప్రాయాన్ని ఒక పార్టీ నేతగా చెప్పిన సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణపై బిజెపి సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు దుందుడుకు వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. సిపిఐ నేత నారాయణను పాకిస్తాన్ పంపించాలంటూ వీర్రాజు మతిభ్రమించిన వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నాం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబితే ప్రస్తుతం భారత్ పాక్ యుద్ధం ఆగిందా? లేదా? అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబితే భారత్ యుద్ధం ఆపేసింది. అంటే ట్రంప్ ను గురువుగా భావించి, ట్రంప్ చెప్పినట్లు మాత్రం - మిగతా2లో



# ఉగ్రవాదం అంతమే లక్ష్యంగా 'ఆపరేషన్ సిందూర్'

**ఇంటర్నెట్ డెస్క్:** ఉగ్రవాదాన్ని అంతం చేసే లక్ష్యంతోనే ఆపరేషన్ సిందూర్ చేపట్టామని భారత సైన్యం వెల్లడించింది. తాము చేపట్టిన ఆపరేషన్‌లో 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారని తెలిపింది. దాడుల భయంతో ఉగ్రశిబిరాలు ఖాళీ అవుతున్నాయని పేర్కొంది. పహల్గాంలో 26 మంది అమాయకులను ముష్కరులు పొట్టనపెట్టుకున్నారని భారత సైన్యం వెల్లడించింది. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి త్రివిధ దళాల అధికారులు మీడియా సమావేశంలో కీలక వివరాలు వెల్లడించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 5, పాక్‌లోని 4 ఉగ్ర శిబిరాలను నేలమట్టం చేసినట్లు తెలిపింది.




**పాకిస్థాన్ వణికిపోయింది: రాజీవ్ ఘాయ్**

"పహల్గాం దాడి తర్వాత ఉగ్రవాదులకు దీటుగా బదులివ్వాలని నిర్ణయించాం. ఉగ్రవాదులకు సరైన రీతిలో జవాబు చెప్పాలన్నదే ఆపరేషన్ సిందూర్ లక్ష్యం. సరిహద్దు అవతల ఉన్న ఉగ్ర శిబిరాలను కచ్చితమైన ఆధారాలతో గుర్తించాం. స్పష్టమైన ఆధారాలతో 9 ఉగ్రవాద శిబిరాలపై దాడులు నిర్వహించాం. ఈ దాడుల్లో 100 మంది ఉగ్రవాదులు చనిపోయారు. ఆ దాడులతో పాకిస్థాన్ వణికిపోయింది. ఆ తర్వాత మన పౌరులే లక్ష్యంగా పాకిస్థాన్ దాడులకు పాల్పడింది. అనంతరం తగిన మూల్యం చెల్లించుకుంది. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో 1999 ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ ఐసీ 814 హైజాక్ ఘటన, 2019లో పుల్వామా దాడుల్లో పాల్గొన్న ముష్కరులు హతమయ్యారు. వీరిలో యూసుఫ్ అజహార్, అబ్దుల్ మాలిక్ రౌఫ్, ముదాసిర్ అహ్మద్ తదితరులు ఉన్నారు" అని ఆర్మీ డీజీఎంవో రాజీవ్ ఘాయ్ వెల్లడించారు.

**40 మంది పాక్ సైన్యం మృతి!**

"ఈ నెల 8, 9వ తేదీ రాత్రి భారత్‌పై గగనతల దాడికి పాకిస్థాన్ యత్నించింది. డ్రోన్లు, మానవరహిత విమానాలు మనవైపు దూసుకొచ్చాయి. వాటన్నింటినీ భారత గగనతల రక్షణ వ్యవస్థ సమర్థంగా తిప్పికొట్టింది. పౌరులపై దాడులను అడ్డుకున్నాం. డ్రోన్ దాడులకు ప్రతిగా పాక్ రాడార్ స్టేషన్లు, సైనిక స్థావరాలపై బలమైన దాడులు నిర్వహించాం. గగనతలం నుంచి భూతలంపై ఉన్న లక్ష్యాలను ఛేదించాం. లక్ష్యాల సాధనలో భారత్‌వైపు ఎలాంటి నష్టం లేకుండా దాడులు చేశాం. భారత్‌వైపు వచ్చిన ప్రతి డ్రోన్‌ను నిర్వీర్యం చేశాం" "లాహోర్, గుజ్రన్‌వాలా రాడార్ కేంద్రాలను ధ్వంసం చేశాం. డ్రోన్ల దాడుల సమయంలో పాకిస్థాన్ పౌరవిమానాలనూ ఆకాశంలోకి అనుమతించింది. పరిస్థితి గమనిస్తూ.. కచ్చితమైన లక్ష్యాలతో పాక్ సైనిక స్థావరాలపై దాడులు చేశాం. మొత్తంగా మూడు రోజులపాటు కొనసాగిన దాడుల్లో 35 నుంచి 40 మంది పాకిస్థాన్ సైనికులు చనిపోయినట్లు అంచనా వేస్తున్నాం" అని డీజీఎంవో స్థాయి అధికారులు పేర్కొన్నారు.

**పర్యవసానాలు రుచిచూపించాం**

"భారత వాయుసేన, క్షిపణి రక్షణ వ్యవస్థలతో సైన్యం పాక్‌కు స్పష్టమైన సందేశం ఇచ్చాం. పాక్ దుస్సాహసానికి పాల్పడితే ఎలాంటి పర్యవసానాలు ఎదురవుతాయో చూపించాం. సైన్యం, వాయుసేన చర్యలకు అనుబంధంగా అరేబియా సముద్రంలో నౌకాదళం సర్వసన్నద్ధంగా ఉంది. కశ్మీర్ నుంచి గుజరాత్ వరకు సరిహద్దు నగరాలపై డ్రోన్ దాడులకు యత్నించింది. గుంపులు గుంపులుగా డ్రోన్‌లతో దాడులకు యత్నించింది" అని త్రివిధ దళాల అధికారులు పేర్కొన్నారు.

**మళ్లీ దాడులు చేస్తే..**

"పాక్ ఎన్ని దుశ్చర్యలకు పాల్పడినా దీటుగా స్పందించేందుకు సిద్ధంగా ఉన్నాం. పాక్ ప్రతిపాదన మేరకే కాల్పుల విరమణపై అవగాహనకు వచ్చాం. అయినా కొన్ని గంటల్లోనే మళ్లీ డ్రోన్ దాడులు కొనసాగించింది. ఇదే పరిస్థితి నేడు కొనసాగితే తీవ్ర ప్రతిచర్యలు ఉంటాయి. ఉల్లంఘనలపై దీటుగా స్పందించేందుకు క్షేత్రస్థాయి అధికారులకు సైన్యాధ్యక్షుడు పూర్తి అధికారాలు ఇచ్చారు" అని డీజీఎంవో అధికారి స్పష్టం చేశారు.

# ఉగ్రవాదంపై రాజీ లేదు.. పాక్‌ని తుడిచిపెట్టేసే సత్తా మనకు ఉంది

**ముంబయి:** ఉగ్రవాదాన్ని భారత్ ఎట్టి పరిస్థితుల్లో సహించదని.. ప్రపంచ పటం నుంచి పాకిస్థాన్‌ను తుడిచిపెట్టేసే సత్తా మన దేశానికి ఉందని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే(%జుఎఅఫ్ష్ర రాష్ట్రఱఅసవ%) అన్నారు. ఆదివారం ఆయన ముంబయిలో మీడియాతో మాట్లాడారు. నాలుగు రోజుల పాటు డ్రోన్, క్షిపణి దాడులతో సరిహద్దు ప్రాంతం దద్దరిల్లిన నేపథ్యంలో శనివారం భారత్ - పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన మరుసటి రోజు శిందే ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఉగ్రవాదంపై ఎట్టిపరిస్థితుల్లో రాజీ ఉండదని, దీన్ని సహించేది లేదంటూ ప్రధాని నరేంద్ర మోదీ పాకిస్థాన్‌కు గట్టి సందేశాన్నిచ్చారన్నారు. బాహ్య ముప్పును ఎదుర్కొనేందుకు భారత్ సామర్థ్యాన్ని కలిగి ఉందని తెలిపారు. ఈ ప్రపంచ పటం నుంచి పాక్‌ను తుడిచిపెట్టే సామర్థ్యం భారత్‌కు



ఉందన్న శిందే.. మన దేశ దృఢమైన వైఖరిని చూసి పాకిస్థాన్ నేర్చుకోవాలన్నారు. తన సొంత పరిమితులేంటో తెలుసుకొని భారత్‌తో సంబంధాలు పెట్టుకోవాలన్నారు. భారత్-పాక్ మధ్య శనివారం కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కాల్పుల విరమణ, తదనంతర పరిస్థితిపై ఇరు దేశాల మధ్య సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు కీలక చర్చలు జరగనున్నాయి. హాట్‌లైన్‌లో జరగనున్న ఈ చర్చల్లో రెండు దేశాల డైరెక్టర్ జనరల్ మిలటరీ ఆపరేషన్స్‌లు పాల్గొననున్నారు.

# ప్రధాని మోదీకి జేడీ వాన్స్ ఫోన్

**న్యూఢిల్లీ:** అగ్రరాజ్యం అమెరికా సాక్షిగా భారత్-పాకిస్తాన్‌ల మధ్య కాల్పుల విరమణ చర్చలకు ముందు భారత ప్రధాని నరేంద్ర మోదీకి యూఎస్‌ఏ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఫోన్ చేసి మాట్లాడారు. భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్తతలపై మోదీతో మాట్లాడారు జేడీ వాన్స్. పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు జేడీ వాన్స్. అయితే పాక్ దాడి చేస్తే తాము దాడికి దిగుతామంటూ జేడీ వాన్స్‌కు మోదీ స్పష్టం చేశారు. తమ సంయమనం బలహీనత కాదని, దేశ భద్రతపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని మోదీ పేర్కొన్నారు ఉగ్రవాదంపై రాజీపడే ప్రసక్తే లేదని జేడీ వాన్స్‌కు తేల్చిచెప్పారు నరేంద్ర మోదీ.



రేపు(సోమవారం) పాకిస్తాన్ తో కాల్పుల విరమణ అంశానికి సంబంధించి చర్చలు జరుగుతున్న సమయంలో జేడీ వాన్స్ ఫోన్ చేసి మాట్లాడటం చర్చనీయాంశమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ నేతృత్వంలో భారత్-పాక్‌ల మధ్య కాల్పుల విరమణ అంశంపై చర్చలు జరుగునున్న తరుణంలో జేడీ వాన్స్ ముందగా పోన్ చేసి మోదీతో మాట్లాడారు. అయితే అంతకమునుపే కశ్మీర్ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని మోదీ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. పీవోకే విషయంలో భారత్ రాజీపడే ప్రసక్తే ఉండదన్నారు. దీనికి ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదని అమెరికాకు పరోక్షంగా చెప్పేశారు మోదీ. పీవోకే తమదేనని, ఇందులో ఎవరు జోక్యం అవసరం లేదన్నారు. పీవోకేను తమకు అప్పగించడం ఒక్కటే పాకిస్తాన్ కు ఉన్న ఆప్షన్ అని మోదీ తెగేసి చెప్పేశారు. కాగా, భారత్, పాకిస్తాన్‌ల మధ్య చోటు చేసుకున్న ఉద్రిక్తతలు. ఆపై చోటు చేసుకున్న కాల్పుల విరమణ అంగీకారంతో పరిస్థితులు సద్దుమణిగాయి. పాకిస్తాన్ కాళ్ల బేరానికి డైరెక్ట్‌గా భారత్‌ను ఆశ్రయించకపోయినా అమెరికా అడ్డం పెట్టుకుని కాల్పుల విరమణకు వచ్చారన్నది జగమెరిగిన సత్యం. భారత్, పాక్‌లు కాల్పుల విరమణకు అంగీకారం అంటూ ముందుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించడమే ఇందుకు ఉదాహరణ. ఇక్కడ యుద్ధానికి కాలుదువ్వింది పాకిస్తాన్.. అసలు కాల్పులకు పాల్పడుతోంది ఎవరు?. అది పాకిస్తాన్ కాదా?. అందుకు పహల్గామ్ ఘటన సాక్ష్యం కాదా?. మరి కాల్పుల విరమణ అనేది ఇక్కడ కేవలం పాకిస్థాన్‌కే వర్తిస్తుందనేది ప్రపంచానికి అంతటికీ అర్థమైంది. అయితే దాయాది పాకిస్తాన్‌ను అంత త్వరగా నమ్మలేమన్నది కూడా తేలిపోయింది. అయితే ఈ పరిస్థితుల నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్‌ను భారత్ కొనసాగించనుంది. ఈ విషయాన్ని భారత ఆర్మీ స్పష్టం చేసింది కూడా. పాక్ ఏమైనా దుశ్చర్యలకు పాల్పడితే ఆపరేషన్ సిందూర్ సిద్ధంగానే ఉందనే సంకేతాలు పంపింది భారత ప్రభుత్వం.

# పీవోకే విషయంలో ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదు

**ఢిల్లీ:** పీవోకేపై ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్ విషయంలో తమ వైఖరిని ఎట్టిపరిస్థితుల్లోనూ మార్చుకునేది లేదని తేల్చి చెప్పారు.. పీవోకేను మాకు అప్పగించడం తప్ప పాక్‌కు వేరే మార్గం లేదన్నారు మోదీ. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియ లేదని, పాక్ కాల్పులు జరిపితే భారత్ దాడులు చేయడం ఖాయమన్నారు.. 'వాళ్లు (పాక్) ఒక్క తూటా పేలిస్తే.. మీరు క్షిపణితో దాడి చేయండి' అంటూ త్రివిధ దళాలకు మోదీ ఫ్రీ హ్యాండ్ ఇచ్చారు. రేపు పాకిస్తాన్‌తో చర్చల వేళ భారత్ వైఖరి ఏమిటో ప్రధాని మోదీ ఒక్కరోజు ముందుగానే ప్రపంచానికి తేల్చి చెప్పారు. పీవోకే విషయంలో అవసరమైతే తాను మధ్యవర్తిత్వం వహిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో మోదీ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అసలు పీవోకే విషయంలో తమకు ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదని, దానిని పాక్ తమకు అప్పగించడం తప్పితే మరో మార్గం లేదని మోదీ వ్యాఖ్యానిండంతో ట్రంప్ దీనికి మధ్యవర్తిత్వం వహించాల్సిన అవసరం లేదనే విషయాన్ని మోదీ సూటిగా చెప్పేశారు. ఈ సమావేశంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్, ఎన్ఎస్ఏ అజిత్ దోవల్,సీడీఎస్‌తో పాటు త్రివిధ దళాదిపతులు హాజరయ్యారు.

## అధికార లాంఛనాల మధ్య మురళీనాయక్ అంత్యక్రియలు పూర్తి

-మొదటిపేజీ తరువాయి

ఓదార్చారు. మురళీ నాయక్ స్నేహితులు, బంధువులను పరామర్శించారు. యుద్ధానికి ముందు వీరజవాన్ మురళీ నాయక్ బంధువు, స్నేహితుడు రాజశేఖర్ తో జరిపిన వాట్సాప్ చాట్ ను మంత్రి పరిశీలించారు. మురళీనాయక్ జ్ఞాపకాలను ఈ సందర్భంగా బంధువులు పంచుకున్నారు. వీరజవాన్ మురళీ నాయక్ కు జై, భారత్ మాతాకి జై, వందేమాతరం అంటూ ప్రజలు, స్థానికులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. అగ్నివీర్ మురళీ నాయక్ భౌతిక కాయానికి నివాళులు అర్పించి, అంత్యక్రియల్లో పాల్గొనేందుకు భారీసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

**వీరజవాన్ మురళీ నాయక్ పార్థివదేహాన్ని మోసిన మంత్రి లోకేష్**

వీరజవాన్ మురళీ నాయక్ అంతిమ యాత్రలో పాల్గొన్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్.. మురళీ నాయక్ పార్థివదేహాన్ని స్వయంగా మోసారు. ప్రభుత్వ అధికారిక లాంఛనాల మధ్య మురళీ నాయక్ వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలను పూర్తిచేశారు. అంతకుముందు ఉదయం నుంచి వీరజవాన్ మురళీ నాయక్ అంత్యక్రియల ఏర్పాట్లను మంత్రి లోకేష్ దుగ్గరుండి పర్యవేక్షించారు. అధికారులతో మాట్లాడి ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, సవిత, సత్యకుమార్ యాదవ్, ఎంపీ బీకే పార్థసారథి, మాజీ మంత్రులు పల్లె రఘునాథరెడ్డి, కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పల్లె సింధూరారెడ్డి, ఎంఎస్ రాజు, జేసీ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అమర వీరుడి కుటుంబానికి ప్రభుత్వం రూ. 50 లక్షల ఆర్థిక సహాయం





-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఉద్రిక్తతల్లో అగ్నివీర్ గా 2022లో విధుల్లో చేరిన ఆంధ్రప్రదేశ్ కి చెందిన మురళీ నాయక్ అమరులయ్యారు. రైల్వే ఉద్యోగం వచ్చినా కాదనుకుని దేశం కోసం పని చేయాలనుకున్న యువకుడు మురళీ నాయక్. అవసరం అయితే దేశం కోసం ప్రాణాలు ఇస్తానని చెప్పి సైన్యంలో చేరిన 23 ఏళ్ల వయస్సుకే ప్రాణాలు కోల్పోవాల్సి రావడం బాధాకరం. సరిహద్దుల్లో ఉగ్రదాడులు, యుద్ధాలు జరిగితే దాని ప్రభావం దేశం మొత్తం కనబడుతుంది అనడానికి ఇది మరో ఉదాహరణ. చిన్న వయసులోనే ఈ అగ్నివీరుడు మతి చెందడం తీవ్రంగా కలచివేసింది. ఉగ్రదాడికి వారం రోజుల ముందు పాకిస్థాన్ ఆర్మీ జనరల్ ఉగ్రవాదులను ప్రేరేపించి దాడికి ఉసిగొల్పారు. అనేక మంది అమాయకుల ప్రాణాలు అన్యాయంగా బలిగొన్నారు. 1947లో దేశం నుంచి విడిపోయారు. నాలుగుసార్లు యుద్ధాలు చేశారు. ఇప్పటికీ అమాయకులను పొట్టన పెట్టుకుంటున్నారు. అయినా పాకిస్థాన్ దాహం తీరలేదు. నిన్నటికి నిన్న కాల్పుల విరమణ అని ఒప్పుకొని దాన్ని ఉల్లంఘించిన ప్రభుత్వం అది. పాకిస్థాన్ కి ఒక విధానం అంటూ లేదు. వాళ్లు చేసే అరాచకాలు, పాక్ ప్రేరేపిత ఉగ్రవాద కార్యకలాపాలు భారత దేశానికి ఇబ్బందిగా మారాయి. ఢిల్లీ, ముంబై దాడులు కావచ్చు. కశ్మీర్ లో కావచ్చు, కోయంబత్తూర్, జమా మసీద్ పేలుళ్లు, గోకుల్ చాట్, లుంబినీ పార్క్ పేలుళ్లు కావచ్చు. వీటన్నింటికీ ఎక్కడో ఒక చోట ముగింపు పలకాలి. మోదీ ప్రభుత్వం సరైన గుణపాఠం చెప్పాలని కోరుకుంటున్నారు.

ఆర్థిక సహాయంతో పాటు 5 ఎకరాల పొలం..

మురళీ నాయక్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ. 50 లక్షలు, తన వ్యక్తిగత సాయం కింద రూ. 25 లక్షలు ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తరపున మురళీ నాయక్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చాం. ఆ కుటుంబానికి ఐదు ఎకరాల స్థలం, 300 గజాల ఇంటి స్థలంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తాం. మురళీ నాయక్ స్మారక చిహ్నం ఏర్పాటు చేస్తాం. ఆ కుటుంబానికి ఇంకా ఎలాంటి సాయం కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. మురళీ నాయక్ నా అభిమాని కూడా అని తెలిసి చాలా బాధ కలిగింది. ఈ పరిస్థితుల్లో ఆయన భౌతిక కాయానికి నివాళులు అర్పించేందుకు రావడం బాధాకరం. మురళీ నాయక్ అందరికంటే దేశాన్ని ప్రేమించే వ్యక్తి. అలాంటి వ్యక్తిని కోల్పోవడం బాధ కలిగించింది. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. కూటమి ప్రభుత్వం వారికి అండగా ఉంటుంది" అన్నారు. కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, వంగలపూడి అనిత గారు, సత్యకుమార్ యాదవ్, సవిత, పార్లమెంటు సభ్యులు పార్థసారధి, శాసన సభ్యులు శ్రీ దగ్గుబాటి ప్రసాద్, పల్లె సింధూరరెడ్డి, ఎం.ఎస్. రాజు, అహుడా ఛైర్మన్ టి.సి. వరుణ్, జనసేనట పార్టీ ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, పార్టీ నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, భవానీ రవికుమార్, పత్తి చంద్రశేఖర్, ఈశ్వర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.


## మతిభ్రమించిన సోము వీర్రాజుని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వద్దకు పంపాలి.

-మొదటిపేజీ తరువాయి

వింటారా? ఇప్పుడు సోము వీర్రాజు అమెరికా వెళ్లి ట్రంప్ తో ఉంటారా? భారతదేశ సార్వభౌమాధికారాన్ని, ప్రజల విచక్షణను గాలికి వదిలి ట్రంప్ చెప్పిన మాటలు విని యుద్ధం ఆపేసింది నిజమా కాదా? సోము వీర్రాజు నారాయణపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి అమెరికా వెళ్లి తమ గురువు ట్రంప్ తో ఉంటే మంచిదని హితవు పలుకుతున్నాం. ప్రపంచ సంఘర్షణలకు మూలకారకమైన సామ్రాజ్యవాదశక్తి యునైటెడ్ స్టేట్స్, ద్వైపాక్షిక సమస్యగా ఉండాల్సిన దానిలో మధ్యవర్తిత్వం వహించడం, అందుకు భారత మరియు పాకిస్తాన్ ప్రభుత్వాలు అంగీకరించడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది.

## వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# నిర్వహించిన జాబ్ మేళాలో 39 మందికి ఉద్యోగాలు




– నియామక పత్రాలు అందజేసిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్

**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ మే 11:** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో ఆదివారం రామచంద్రపురంలోని ఉపాధి కార్యాలయంలో 'సత్యం వాసంశెట్టి ఫౌండేషన్' పర్యవేక్షణలో నిర్వహించిన జాబ్ మేళాలో 39 మంది ఎంపిక అయ్యారు. ఇందులో ప్రముఖ హెటేరో కు 6 , కియా కు 9 , బ్లుస్టార్ కు 14 , ఎన్ ఎస్ ఇన్స్టుమెంట్స్, ఏషియన్ ఆటోపార్ట్స్, పానాసోనిక్ కు 10 కలిపి మొత్తంగా 39 మంది ఎంపిక య్యారు. ఎంపికైన వారికి సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్, మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యంఆధ్వర్యంలో కంపెనీ ప్రతినిధుల సమక్షంలో ఉపాధి కార్యాలయంలో నియామక పత్రాలు అందించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో ప్రతివారం రామచంద్రపురంలోని ఉపాధి కార్యాలయంలో పలు కంపెనీలు జాబ్ మేళా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. నియోజవర్గంలో నిరుద్యోగ సమస్యను రూపుమాపేందుకు రాష్ట్రంలోని పలు కంపెనీలతో ఒప్పందం చేసుకొని దశలవారీగా జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నారు. ఉపాధి కల్పన నిరంతర ప్రక్రియగా సాగాలనదే మంత్రి సుభాష్ అభిమతం. హెటిరో ప్రతినిధి సమీర్, బ్లుస్టార్ , డైకిన్ ప్రతినిధి మురళి, ఎన్ ఎస్ ఇన్స్టుమెంట్స్, ఏషియన్ ఆటోపార్ట్స్, పానాసోనిక్ ప్రతినిధులు సుధాకర్, చంద్రబాబు, ఉపాధి ప్రాజెక్ట్ డైరెక్టర్ రామ్ కుమార్, సీఈవో అనిల్ ఉండు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం తమకు ఉద్యోగ అవకాశాలు కంపెనీ హెచ్ఆర్ లకు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ కు ఉద్యోగ అవకాశం పొందిన వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

# వీరుడా నాయక్ మళ్లీ పుట్టాలి..






– ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ఆకాంక్ష
– జవాన్ మురళీ నాయక్ పార్థివ దేహం ఎదుట సెల్యూట్
– అంతిమయాత్రలో పాల్గొన్న పరిటాల సునీత, శ్రీరామ్

**అంకుశం న్యూస్ అనంతపురం మే 11:** భారత మాత కోసం ప్రాణాలు అర్పించిన వీరుడా.. మళ్లీ నువ్వు ఈ గడ్డపైనే పుట్టాలి.. ఈ గడ్డ కోసమే సేవలందించాలని ఆకాంక్షించారు.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్. పాకిస్తాన్ కాల్పుల్లో వీర మరణం పొందిన జవాన్ మురళీ నాయక్ అంత్యక్రియల్లో వారు పాల్గొన్నారు. మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి వారు మురళీ నాయక్ పార్థివదేహం వద్ద ఘనంగా నివాళు లర్పించారు. మరోసారి మురళీ నాయక్ తల్లిదండ్రులను కలిసి ఓదార్చారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. వీరుడా నీకు వందనం అంటూ వీడ్కోలు పలికారు. ఒకానొక సందర్భంలో పరిటాల సునీత భావోద్వేగానికి గురయ్యారు. ఉన్న ఒక్క బిడ్డను దేశం కోసం అర్పించిన ఆ తల్లిని చూస్తుంటే ఎంతో గర్వంగా ఉందని.. మరోవైపు ఆ తల్లి రోదన చూస్తుంటే బాధగా ఉందని ఆమె వ్యాఖ్యానించారు. మారు మూల గ్రామంలో పుట్టి ఇప్పుడు దేశమంతా కీర్తించే స్థాయికి మురళీ నాయక్ వెళ్లారంటే అది చిన్న విషయం కాదన్నారు. భారతమాత కోసం మరికొంతమంది సైనికులుగా రంగంలోకి రావాలని ఆమె పిలుపునిచ్చారు. మరోవైపు శ్రీరామ్ మాట్లాడుతూ ఎన్ని రోజులు బ్రతికామన్నది కాదని.. ఎంత గొప్పగా బ్రతికామన్నదే అందరూ చర్చించుకుంటారన్నారు. ఈ రోజు మురళీ నాయక్ 25ఏళ్లకే వీరమరణం పొంది యావత్ దేశం మొత్తం కీర్తించుకుంటున్నారంటే అది ఎంత గొప్ప మరణమో మనం అర్థం చేసుకోవచ్చన్నారు. ఇప్పటికే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆ కుటుంబానికి అండగా నిలిచాయని.. వారికి ఏ అవసరం ఉన్నా మా వంతు సహకారం ఉంటుందని పరిటాల శ్రీరామ్ స్పష్టం చేశారు...

## 12వ తేదీన గార్లదిన్నెలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

– : గార్లదిన్నె మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
– : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,



**అంకుశం న్యూస్ అనంతపురం, మే 11 :** అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గం లోఈనెల 12వ తేదీన సోమవారం గార్లదిన్నెలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని గార్లదిన్నె మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం పక్కన ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. గార్లదిన్నె మండల ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## తిరుచానూరు శ్రీ పద్మావతి

# అమ్మవారి వసంతోత్సవాలు ప్రారంభం





– మే 12న స్వర్ణ రథోత్సవం

**అంకుశం న్యూస్ తిరుపతి మే 11 :**తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక వసంతోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు మధ్యాహ్నం శుక్రవారపుతోటలో స్నపనతిరుమంజనం వేడుకగా జరిగింది. మే 12న ఉదయం 9.45 గంటలకు స్వర్ణ రథోత్సవం కన్నులపండువగా జరగనుంది. వసంత ఋతువులో మేషరాశిలో సూర్యుడు ఎక్కువ ప్రకాశవంతంగా ఉంటాడు. సూర్యకిరణాల వేడి వల్ల జీవులకు వ్యాధి బాధలు కలుగుతాయి. లోకమాత అయిన శ్రీ పద్మావతి అమ్మవారిని వసంతోత్సవాల ద్వారా ఆరాధించడం వల్ల శారీరక, మానసిక తాపాలు తొలగుతాయి. వైభవంగా స్నపన తిరుమంజనం వసంతోత్సవాల్లో భాగంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన నిర్వహించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు అమ్మవారి ఉత్సవర్లను ఆలయం నుండి శుక్రవారపు తోటకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. 2.30 నుండి 4.30 గంటల వరకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో భాగంగా పసుపు, కుంకుమ, పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. సాయంత్రం అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సంగీత కార్యక్రమాలు జరిగాయి. రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు అమ్మవారిని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించనున్నారు. భక్తులు ఒక్కొక్కరు రూ.150/- చెల్లించి ఒక రోజు వసంతోత్సవంలో పాల్గొనవచ్చు. వసంతోత్సవం కారణంగా ఆదివారం కల్యాణం, సహస్రదీపాలంకార సేవలు రద్దయ్యాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆలయ అర్చకులు బాబు స్వామి, డిప్యూటీ ఈవో గోవింద రాజన్, సూపరింటెండెంట్ రమేష్, ఆలయ ఇన్స్పెక్టర్ లు చలపతి, సుభాస్కర్, సుబ్బరాయుడు, ఇతర సిబ్బంది, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అనంత పెద్దాస్పత్రిలో రేపు మెగా రక్తదాన శిబిరం

వీర సైనికుడు మురళీ నాయక్ కు నివాళిగా మెగా రక్తదాన శిబిరం ఏర్పాటుకు సన్నాహాలు
ముఖ్య అతిథిగా హాజరు కానున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్




**అంకుశం న్యూస్ అనంతపురం, మే 11:** భారత్ – పాక్ యుద్ధంలో వీర మరణం పొందిన సైనికుడు మురళీ నాయక్ త్యాగానికి స్ఫూర్తిగా అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఆర్. ఎం. ఓ డాక్టర్ జీ.హేమలత ఆధ్వర్యంలో సోమవారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నారు. భారతదేశం కోసం మురళీ వీరోచితంగా పోరాడి 15 మంది పాక్ సైన్యాన్ని మట్టుబెట్టి..చివరకు తను ప్రాణాలు వదలి చరిత్రలో నిలిచిపోవడం గర్వంగా పేర్కొన్నారు. ఆయన దేశం కోసం రక్తం చిందించగా..అదే స్ఫూర్తితో రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై..మెగా రక్తదాన శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ప్రతి ఒక్కరూ తమవంతు కర్తవ్యంగా హాజరై..రక్తదానం చేయడం ద్వారా మన సైనికుడు మురళీ నాయక్ ఆశయ సాధనలో భాగస్వాములు కావాలని ఆర్. ఎం. ఓ డాక్టర్ జి.హేమలత పిలుపునిచ్చారు.

## గోవిందపల్లె అభివృద్ధికి కృషి చేస్తా

– ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



**అంకుశం న్యూస్ కర్నూల్ మే 11:** ఆళ్లగడ్డ నియోజకవర్గం ఉయ్యాలవాడ మండలం గోవిందపల్లె గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హామీ ఇచ్చారు. శనివారం ఉయ్యాలవాడ మండలం గోవిందపల్లెలో శ్రీ ఉమామహేశ్వర స్వామివారి ఆలయ పున: ప్రతిష్టలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు, అర్చకులు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తో విశేష పూజలు చేయించి, తీర్థ ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సన్మానం చేశారు. అనంతరం గ్రామస్థులు, టీడీపీ నాయకులతో ఎంపీ శబరి సమావేశమై గోవిందపల్లె గ్రామాభివృద్ధికి సహకరిస్థానని హామీ ఇచ్చారు.

## వీర సైనికుడి త్యాగాన్ని "దేశం"మరిచిపోదు: మంత్రి సవితమ్మ




**అంకుశం న్యూస్ పెనుగొండ మే 11:** భారత్ – పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో... ఆపరేషన్ సింధూర్ లో భాగంగా దేశ రక్షణ విధుల్లో ఉండగా పాక్ సైనిక కాల్పుల్లో వీరమరణం పొందిన జవాన్ మురళి నాయక్ త్యాగాన్ని భారతజాతి ఎన్నడు మరిచిపోదని మంత్రి సవితమ్మ అన్నారు. బెంగుళూరు విమానాశ్రయం నుండి సొంతగ్రామం గోరంట్ల మండలం కళ్లితాండ గ్రామానికి సైనిక అధికారులతో కలసి పార్థివ దేహాన్ని తీసుకొని వచ్చారు. అనంతరం ఘన నివాళులు అర్పించి వీరోచిత పోరాటంలో తనువు చాలించిన మురళి నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన మంత్రి సవితమ్మ గారు.

## పయ్యావుల కేశవ్ ను కలిసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి



**అంకుశం న్యూస్ కర్నూల్ మే 11:** టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ఏపి మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి, శ్రీశైలం నియోజక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిని కలుసుకున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగ ఉన్న తులసి రెడ్డినీ టీడీపీ అధిష్టానం మడకశిర నియోజక వర్గానికి పరిశీలకుడిగా నియమించింది. ఆ ఎన్నికల్లో కూటమి నుంచి టీడీపీ అభ్యర్థిగా పార్టీ అధిష్టానం పయ్యావుల కేశవ్ ను ఎన్నికల బరిలో దించింది. దీంతో అప్పటి ఎన్నికల్లో పార్టీ పరిశీలకుడిగా బాధ్యతలు తీసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాతిరెడ్డి తులసిరెడ్డి , పార్టీ తనకు అప్పగించినా భాధ్యతలను సమర్ధవంతంగా పూర్తి చేసి, పయ్యావుల కేశవ్ విజయంలో కీలక పాత్ర పోషించారు. దీంతో. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వ తరుపున తులసి రెడ్డిని ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ గా నియమించింది. ఆదివారం మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డినీ కలుసుకున్న తులసి రెడ్డి, తన స్వగ్రామం ఎన్. కొత్తపల్లె లో ఈనెల 12,13,14 తేదీల్లో జరుగనున్న శ్రీ భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయ మూడవ వార్షికోత్సవానికి ఆహ్వానించారు. ఈమేరకు ఇద్దరికి తులసి రెడ్డి ఆహ్వాన పత్రిక అందజేశారు .

## మాతృ దినోత్సవం సందర్భంగా పలువురు మహిళలను సన్మానించిన మంత్రి సుభాష్

– అపూర్వమైన అమ్మ ప్రేమ.. ఎప్పటికి వెలకట్టలేనిదే....



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ మే 12:** ఈ సృష్టిలో అమ్మ ప్రేమకు విలువ కట్టలేమని, ఆ ప్రేమ అపూర్వమైనదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ప్రపంచ మాతృ దినోత్సవ సందర్భంగా రామచంద్రపురం మండలం చింతకుంట చెరువులోని చంద్రబాబు నగర్ కు చెందిన వెంగళ సత్యవతి, మంగ, పలువురు మహిళలను మంత్రి సుభాష్ పూలమాల, దుస్సాలువ తో సత్కరించి, వారి పాదాలకు నమస్కారం చేసి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఈ సమాజంలో సృష్టికి మూలం అమ్మ అని, మాతృత్వం పొందటం ఒక వరమన్నారు. అమ్మ ప్రేమ ఉంటే అన్నిటా విజయం మన వెంటే ఉంటుందని, అమ్మ ప్రేమ పొందడం గొప్ప వరం అన్నారు. మాతృ దినోత్సవమును పురస్కరించుకొని కొంతమంది అమ్మలను సన్మానించుకోవడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. మహిళల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## వీరజవాన్ మురళీ నాయక్

# పార్థివ దేహాన్ని మోసిన మంత్రి సత్య కుమార్

- అంత్యక్రియల్లో పాల్గొన్న వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్‌లి
- భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించిన మంత్రి
- అధికార లాంఛనాల మధ్య మురళీనాయక్ అంత్యక్రియలు పూర్తి

**అంకుశం న్యూస్ ధర్మవరం మే 11:** ఆపరేషన్ సిందూర్ లో భాగంగా దేశం కోసం ప్రాణాలర్పించిన శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన వీరజవాన్ మురళీనాయక్ అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి సత్యకుమార్, డిప్యూటీ సిఎం శ్రీ పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్ వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, సవిత కల్లి తండాలోని నివాసం వద్ద మురళీనాయక్ పార్థీవదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించిన మంత్రి సత్యకుమార్ వీరజవాన్ మురళీ నాయక్ కు జై, భారత్ మాతాకి జై, వందేమాతరం అంటూ పెద్దఎత్తున నినాదాలు చేసిన ప్రజలు, స్థానికులు అగ్నివీర్ మురళీ నాయక్ భౌతిక కాయానికి నివాళులర్పించి, అంత్యక్రియల్లో పాల్గొనేందుకు భారీసంఖ్యలో తరలివచ్చిన ప్రజలు ప్రభుత్వ అధికారిక లాంఛనాల మధ్య మురళీ నాయక్ వ్యవసాయ క్షేత్రంలో పూర్తయిన అంత్యక్రియలు అంతకుముందు ఉదయం నుంచి వీరజవాన్ మురళీ నాయక్ అంత్యక్రియల ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించిన మంత్రి లోకేష్ మంత్రులతో పాటు ఎంపీ బీకే పార్థసారథి, మాజీ మంత్రులు రఘునాథరెడ్డి, కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పల్లె సింధూరారెడ్డి, ఎంఎస్ రాజు, జేసీ ప్రభాకర్ రెడ్డి తదితరులు





# చంద్రమోహన్ సేవలు ఎనలేనివి







- చంద్ర పేరుతో క్రికెట్ టోర్నీ నిర్వహించడం గర్వంగా ఉంది
- ప్రకాష్ రెడ్డి అధ్యక్షులు అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్

**అంకుశం స్పోర్ట్స్ ప్రతినిధి అనంతపురం మే 11:** అనంతపురం జిల్లాలో క్రికెట్ కోసం సీనియర్ క్రికెటర్ చంద్రమోహన్ ఎనలేని సేవలు అందించారని ప్రకాష్ రెడ్డి అధ్యక్షులు అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అన్నారు . అనంతపురం నగరంలోని ఆర్డీటి స్టేడియం నందు సీనియర్ క్రికెటర్ చంద్రమోహన్ మెమోరియల్ క్రికెట్ టీ20 టోర్నమెంట్ రెండోవ రోజు మ్యాచ్ ప్రారంభానికి ముందు సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి భీమలింగారెడ్డి జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి అధ్యక్షత వహించారు ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ చంద్రమోహన్ పేరుతో టోర్నమెంట్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహించడం గర్వంగా ఉందన్నారు చంద్రమోహన్ జిల్లా క్రికెట్ కు చేసిన సేవ మరువలేమని అన్నారు మ్యాచ్ ప్రారంభానికి ముందు సీనియర్ క్రికెటర్లు ప్రకాష్ రెడ్డి, మచ్చా రామలింగారెడ్డి, భీమలింగరెడ్డి, షాబుద్దీన్, మురళి, చంద్రమోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రికెటర్లు యుగంధర్ రెడ్డి, విజయరాజు తదితరులు పాల్గొన్నారు

## తల్లిదండ్రులను పరామర్శించి

# ధైర్యం చెప్పిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్






- అధికార లాంఛనాల మధ్య మురళీనాయక్ అంత్యక్రియలు పూర్తి
- వీరజవాన్ మురళీ నాయక్ అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రివర్యులు

**అంకుశం ప్రతినిధి పెనుగొండ మే 11:** ఆపరేషన్ సిందూర్ లో భాగంగా దేశం కోసం ప్రాణాలర్పించిన శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన వీరజవాన్ మురళీనాయక్ అంత్యక్రియల్లో ఆదివారం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మరియు రాష్ట్ర మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. కల్లితండాలోని నివాసం వద్ద మురళీ నాయక్ భౌతికకాయాన్ని సందర్శించి అశ్రు నివాళులు అర్పించారు. మురళీనాయక్ పార్థీవదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి సెల్యూట్ చేశారు. అనంతరం అగ్నివీర్ మురళీనాయక్ తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని డిప్యూటీ సీఎం, ఐటి శాఖ మంత్రి వర్యులు వారిని ఓదార్చారు. అనంతరం డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడుతూ

కుటుంబానికి అండగా ఉంటాం క్యాబినెట్లో చర్చించి మురళీనాయక్ కుటుంబానికి ఐదెకరాల పొలంతో పాటు మరో 300 గజాల ఇంటి స్థలాన్ని అందిస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. మురళీనాయక్ పార్థివదేహానికి నివాళులర్పించడానికి కల్లితండాకు వచ్చిన పవన్ మురళీనాయక్ కుటుంబానికి రూ.25 లక్షల వ్యక్తిగత సాయం చేస్తానని హామీ ఇచ్చారు. మురళీ కుటుంబానికి ఎలాంటి సాయం కావాలన్నా తమ మూడు పార్టీలు సిద్ధంగా ఉంటాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గుర్తు చేశారు. మురళీనాయక్ కుటుంబానికి

భగవంతుడు ధైర్యం ఇవ్వాలని కోరుకుంటున్నానని పవన్ ఆకాంక్షించారు.మురళీనాయక్ కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం తరపున అందిస్తామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్?, మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. అనంతరం ఐటి శాఖ మంత్రి వర్యులు నారా లోకేష్ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో మురళీనాయక్ స్మారక చిహ్నం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఈ సందర్భంగా తెలిపారు. అంతేకాకుండా మురళీనాయక్ తండ్రికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించినట్లు లోకేశ్ అన్నారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు కల్లితండాను మురళీనాయక్ తండాగా మారుస్తామని లోకేశ్ పేర్కొన్నారు. చిన్న వయసులో మురళీనాయక్ మృతి బాధాకరమని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.స్వగ్రామంలో వీరజవాన్ మురళీనాయక్ అంత్యక్రియలు పూర్తి

అంతకు మునుపు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ మురళీ నాయక్ స్నేహితులు, బంధువులను పరామర్శించారు. యుద్ధానికి ముందు వీరజవాన్ మురళీ నాయక్ బంధువు, స్నేహితుడు రాజశేఖర్ తో జరిపిన వాట్సాప్ చాట్ ను మంత్రి పరిశీలించారు. మురళీనాయక్ జ్ఞాపకాలను ఈ సందర్భంగా బంధువులు పంచుకున్నారు. వీరజవాన్ మురళీ నాయక్ కు జై, భారత్ మాతాకి జై, వందేమాతరం అంటూ ప్రజలు, స్థానికులు పెద్దఎత్తున నినాదాలు చేశారు.

వీరజవాన్ మురళీ నాయక్ పార్థీవదేహాన్ని మోసిన మంత్రి లోకేష్‌లివీరజవాన్ మురళీ నాయక్ అంతిమ యాత్రలో




పాల్గొన్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్.. మురళీ నాయక్ పార్థీవదేహాన్ని స్వయంగా మోసారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర హెూం శాఖ మంత్రివర్యులు వంగలపూడి అనిత, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు సవిత, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు సత్యకుమార్ యాదవ్, ఎంపీ బీకే పార్ధసారథి, మాజీ మంత్రులు పల్లె రఘునాథరెడ్డి, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పుట్టపర్తి పల్లె సింధూరారెడ్డి, మడకశిర ఎంఎస్ రాజు, కదిరి కందికుంట వెంకటప్రసాద్, తాడిపత్రి ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి, తాడిపత్రి మున్సిపల్ చైర్ పర్సన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పి విరత్న, ఇతర ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

.

## ఆర్డీటిని కాపాడుకోవాలి

- ఏడవ రోజు రిలే దీక్షలో టీవి చంద్ర మోహన్ రెడ్డి




**అంకుశం న్యూస్ అనంతపురం మే 11:** ఆర్డీటికి అడ్డంకులు ఆంక్షలు తొలగిపోయేందుకు చేసే ఉద్యమంలో అంతిమ విజయం తమదే అని క్రికెట్ కోచ్ టీవీ చంద్రమోహన్ రెడ్డి అన్నారు.కేంద్ర ప్రభుత్వం ఆర్డిటి ఎఫ్ సి ఆర్ ఎ రెన్యువల్ వెంటనే చేయాలని సుగా మంచి శ్రీనివాసులు అధ్యక్షతన చేపడుతున్న ఏడవ రోజు రిలే నిరాహార దీక్షలకు ముఖ్య అతిథిగా క్రికెట్ కోచ్ టీవీ చంద్రమోహన్ రెడ్డి విచ్చేసి మాట్లాడారు. ఆర్డిటిలో వేలాది మంది విద్యార్థిని విద్యార్థులకు క్రీడల్లో రాణించే విధంగా కోట్ల రూపాయల ఖర్చు చేసిందన్నారు.అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ స్టేడియం కూడా ఏర్పాటు చేసి జిల్లాకు పేరు తెచ్చిన ఘనత ఆర్డిటి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ కే దక్కుతుందన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని పేదలనే కాకుండా పట్టణ నగర ప్రాంతాల్లో కూడా అభివృద్ధికి అడుగులు వేసిన ఆర్డిటిని అనంతపురం జిల్లా ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరన్నారు.అఖిలపక్ష కమిటీ జేఏసీ కన్వీనర్ సాకే హరి మాట్లాడుతూ.. పేదల పక్షపాతి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ కలలు సాకారం కావాలంటే ఆర్డిటిని కాపాడుకోవడమే మొదటి లక్ష్యమన్నారు.ఆర్డిటి ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ విషయంపై అన్ని రాజకీయ పార్టీలు ముఖ్యంగా కూటమి ప్రభుత్వం నాయకులు నోరు విప్పి మాట్లాడి ఆర్డిటిని కాపాడే విధంగా ముందుకు రావాలన్నారు.డిస్కవరీ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. సేవ్ ఆర్డిటి సేవ్ అనంతపురం అన్న నినాదమే ఆర్డిటిని కాపాడుతుందన్న బలమైన నమ్మకంతో ఉద్యమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఓబులేసు.టీవీ రెడ్డి.బికేఎస్ ఆనంద్.పుట్లూరు ప్రభాకర్.భీమసేన రావు.మంజునాథ్.రామకృష్ణ.రాకెట్లసూర్యనారాయణ.రానా.శ్రీనివాసులు క్రికెట్ కోచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## చేనేత పట్టు రీలర్ కు ఘనంగా నివాళులు అన్నదానం



**అంకుశం న్యూస్ ధర్మవరం మే 11:** ధర్మవరం పట్టు చేనేత పరిశ్రమ కు చెందిన పట్టు రీలర్ టంగుటూరి తిరుపాల్ 4 వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయనకు ఘనంగా నివాళులు అర్పిస్తూ గొట్లూరు అనాధ ఆశ్రమం లో అన్నదానం చేసారు. ఈ కార్యక్రమం లో దాడితోట సాయినాథ్ కుమార్, దాడితోట నవీన్ కుమార్ తోటపాటి శ్రీ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## వీర జవాన్ కు తెలుగుదేశం పార్టీ ఘనంగా నివాళుల ర్యాలీ!



**అంకుశం న్యూస్ ధర్మవరం మే 11:** భారత్ యుద్ధ భూమి లో వీర మరణం పొందిన మురళీ నాయక్ కు ధర్మవరం లో తెలుగుదేశం పార్టీ యువ నేత పరిటాల శ్రీ రామ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పిస్తూ శ్రద్ధాంజలి ర్యాలీ జరిపారు. ఈ కార్యక్రమం లో టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ధర్మవరం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి పరిటాల శ్రీ రామ్ రాష్ట్ర టీడీపీ నాయకులు కమతం కాటమయ్య,ఫణి కుమార్, పి. సుధాకర్, శ్రీ శైలం పురుషోత్తం గౌడ్, అంబటి సనత్, కిరోసిన్ పోతలయ్య, కత్తుల బాబ్జి,టీడీపీ మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి సుభాష్



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ మే 11:**రాబోయేరోజుల్లో రామచంద్రపురం నియోజకవర్గాన్ని సుందరవనంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఆదివారం రామచంద్రపురం నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న పలు బిటి రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తుందన్నారు. గతంలో రామచంద్రపురం నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని.. ప్రస్తుతం నియోజకవర్గంలో అభివృద్ధి పనుల మీద దృష్టి సారించడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా రామచంద్రపురం నియోజకవర్గంలో ఆదివారం సుమారు 5 కోట్ల రూపాయల ఉపాధి హామీ నిధులతో వెల్ల -ద్రాక్షారామం రోడ్డు నుండి వెలగపూడి కుసుమంబ ఫీల్డ్ వరకు, బాపనయ్య చెరువు పంచాయతీలో వెంకటాయపాలెం గణపతి నగరం బిటి రోడ్డు, రామచంద్రపురం మున్సిపాలిటీలో కొత్తూరు నుండి మూలపాడు వరకు బిటి రోడ్డు, యనమల గ్రామం లో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలను కూడా అందిస్తుందన్నారు. ఇప్పటికే ఉచిత గ్యాస్ సిలిండర్లను అందిస్తున్నామన్నారు. మే నెలలో తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామన్నారు. రైతులకు పెట్టుబడి సాయం జూన్ నెలలో అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి తెలిపారు అన్నారు. రాబోవు మూడు సంవత్సరాలలో రామచంద్రపురం నియోజకవర్గాన్ని సుందరీకరంగా తీర్చిదిద్దామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, పంచాయతీరాజ్ ఏ ఈ యేసు రత్నం, ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.